సాక్షి జగిత్యాల

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023

తిరగబడ్డ పోరుగడ్డ..





- నిజాంకు ఎదురొడ్డి నిలిచిన పల్లెలు
- వెట్టిని ఎదిరించిన విముక్తి పోరాటం
- నిజాం గుండెల్లో ఫిరంగులు మోగించిన యోధులు
- అమరుల త్యాగఫలంతో స్వేచ్ఛావాయువులు

'బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లేబోతవు కొడుకో నైజాం సర్కరోడా.. నాజీల మించినవురో.. నైజాం సర్కరోడా.' అంటూ.. నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది ఉమ్మడి జిల్లా. నిజాం నిరంకుశ పాలనలో జాగీర్దారులు, మక్తేదారులు, ఇనాందారులు, వతన్ దారుల దుర్మార్గాలు, దౌర్జన్యాలపై వీరోచిత పోరాటం చేసింది. బాంచెన్ కాల్మొక్త అన్న సామాన్యుడే.. బందూకులతో గడీల పునాదులు పెకలించాడు. ఈ పోరులో ప్రత్యేకంగా నిలిచింది మాత్రం హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్. తిమ్మాపూర్ మండలం పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు నిజాంకు వ్యతిరేకంగా చేసిన పోరు శ్లాఘనీయం. రజాకార్ల కాల్పుల్లో అనభేరి, భూపతిరెడ్డి అమరులయ్యారు. వీరితోపాటు మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారి జ్ఞాపకార్థం మహ్మదాపూర్ గుట్టల్లో రెండు సమాధులు నిర్మించారు. ఏటా వారి వర్ధంతి రోజు సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటారు. ఎందరో మహానుభావులు తెలంగాణ సాయుధ పోరులో పాల్గొని ప్రాణాలను పణంగా పెట్టి చివరకు విజయం సాధించారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణకు విముక్తి లభించింది. నేడు తెలంగాణ విమోజన దినోత్సవం సందర్భంగా అలాంటి వారిని ఒక్కసారి మననం చేసుకుందాం..

- వివరాలు 2 లో▸

న్యూస్‌రీల్

'మా బడి తెరిపించండి'


శిబిరంలో తల్లులతో కలిసి చిన్నారుల నిరసన

కోరుట్ల: 'కేసీఆర్ తాతా.. మా అంగన్‌వాడీ బడిని తెరిపించి మా టీచర్లను మాకు పంపించండి' అని అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మెకు మద్దతుగా చిన్నారులు ఆందోళనలో పాల్గొన్నారు. స్థానిక గోదాం రోడ్డులో శనివారం అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె కొనసాగింది. కొన్ని సెంటర్ల పిల్లలు దీక్ష శిబిరంలో ప్లకార్డులు ప్రదర్శించారు. నాయకులు సాయిశ్వరి, సుతారి రాములు, కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ మండలాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపై భక్తుల రద్దీ


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని శనివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. సూపరింటెండెంట్‌లు సునీల్, శ్రీనివాసశర్మ అధికారులు ఏర్పాట్లుపర్యవేక్షించారు.

'ఆయుష్మాన్'పై అవగాహన


మాట్లాడుతున్న శ్రీనివాస్

జగిత్యాలరూరల్: ఆయుష్మాన్ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. శనివారం మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదల వైద్యం కోసం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా ఉచిత వైద్యం అందిస్తోందని ఆయన అన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత

జగిత్యాల: ప్రతీబాలికను చదివించాలని, విద్యతోనే సాధికారత సాధ్యమని మహిళా సాధికారత కో ఆర్డినేటర్ అశ్విని అన్నారు. శనివారం ఇస్లాంపురలోని మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు 181, 1098, చైల్డ్‌హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు బాగా చూసుకోకపోతే 14576 నంబరుకు ఫోన్ చేసి సమస్య వివరించాలని చెప్పారు. వికలాంగులకు పింఛన్, సదరం సర్టిఫికెట్, ట్రైసైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేయాలని సూచించారు. సిబ్బంది హేమశ్రీ, అన్నపూర్ణ, రజిత పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలే మేలు


మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సుజాత

మెట్‌పల్లి(కోరుట్ల): పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతోపాటు పలువు పట్టణ ప్రజలకు శనివారం ఆమె మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సుజాత మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. రసాయనాలతో ఆకర్షణీయంగా తయారుచేసే విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేసినప్పుడు పర్యావరణానికి నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్‌లు పురుషోత్తం, బుచ్చిరెడ్డి, గంగాధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో నాలుగో దశ ప్రవేశాలు

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో నాలుగో దశ ప్రవేశాలు కల్పిస్తున్నామని జగిత్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్స్‌లలో శిక్షణ పొందేందుకు మూడో దశలో మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 29వరకు గడువు ఉందన్నారు.

నేడు పతాకావిష్కరణ

జగిత్యాల: తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

దివ్యాంగులకు భారం

వైకల్యం నిర్ధారణకు కరీంనగర్, హైదరాబాద్‌కు రెఫర్

- కథలాపూర్ ప్రాంతానికి చెందిన ఓ దివ్యాంగుడు సదరం సర్టిఫికెట్ కోసం ఇటీవల స్లాట్ బుక్ చేసుకున్నాడు. వైకల్యం నిర్ధారణ కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు.. మరిన్ని పరీక్షల కోసం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. అదే ఆస్పత్రిలోని ఓ దళారి దివ్యాంగుడి వద్దకు వచ్చి రూ.5వేలు తీసుకుని వెంటనే కరీంనగర్ తీసుకెళ్లాడు. పరీక్షలు చేయించి సాయంత్రం వరకు తీసుకొచ్చాడు. అనుమానం వచ్చిన డాక్టర్లు.. ఆరా తీయగా అందులో తప్పుడు సమాచారం ఉన్నట్లు తెలిసింది. దీంతో వరంగల్‌లో పరీక్ష చేయించుకు రావాలని దివ్యాంగుడికి సూచించారు.


జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

- గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన మరో దివ్యాంగుడు సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశాడు. ఈఎన్‌టీ సమస్య ఉండటంతో కరీంనగర్‌కు బదులు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. అంతదూరం వెళ్లలేనని దివ్యాంగుడు ఇంటికి వెళ్లిపోయాడు.

జగిత్యాల: దివ్యాంగుల కోసం ప్రతినెల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల కోసం శిబిరాలు నిర్వహిస్తుంటారు. తొలుత దివ్యాంగులు మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని, వారికి కేటాయించిన తేదీన ఆస్పత్రికి వస్తుంటారు. డాక్టర్లు పరిశీలించి వైకల్య శాతం నిర్ధారిస్తారు. అయితే, ఈఎన్‌టీ, ఆర్థో, మరికొన్ని విభాగాల డాక్టర్లు.. వైకల్యశాతం నిర్ధారణ కోసం వరంగల్‌లోని ఎంజీఎం, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. అంతదూరం వెళ్లలేక దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో కరీంనగర్‌కు..

వైకల్యం నిర్ధారణ కోసం దివ్యాంగులను గతంలో జగిత్యాల, లేదా కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించేవారు. కరీంనగర్‌లో జారీచేస్తున్న సర్టిఫికెట్లలో అనేక తప్పిదాలు ఉంటున్నాయని గుర్తించిన వైద్యాధికారులు.. వరంగల్, హైదరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఆర్థో, ఈఎన్‌టీ సమస్యతో బాధపడే కేసులు ఉంటున్నాయి. జగిత్యాలలో పరికరాలు అందుబాటులో లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

దళారుల బెడద..

దివ్యాంగులను మచ్చిక చేసుకుంటున్న దళారులు.. కరీంనగర్, హైదరాబాద్‌కు రెఫర్ చేసిన వారిని కరీంనగర్‌కు తీసుకెళ్లి సర్టిఫికెట్లు ఇప్పిస్తామని చెబుతూ అందినకాడికి వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాదు.. ఉదయం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి సాయంత్రమే జగిత్యాల ఆస్పత్రికి తీసుకు రావడంతో వైద్యులకు అనుమానాలు వచ్చాయి. ఇక్కడి ఆస్పత్రి సూపరింటెండెంట్.. కరీంనగర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైకల్యం నిర్ధారణలో తేడాలు వస్తున్నాయని సూచించారు.

సుదూరం వెళ్లలేక..

వైకల్యం నిర్ధారణకోసం కరీంనగర్‌కు వెళ్లాలంటేనే దివ్యాంగులకు భారంగా ఉండేది. అలాంటిది వరంగల్, హైదరాబాద్‌కు రెఫర్ చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వారివెంట సహాయకులు, వారికి వసతుల కల్పన, రవాణా.. తదితర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అంతేకాదు.. అక్కడకు వెళ్లాక ఎవరిని సంప్రదించాలనే విషయం కూడా తెలియక ఒకట్రెండు రోజులు గడిచాక మళ్లీ ఇక్కడకు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారింది. దీంతో చాలామంది వైకల్యం నిర్ధారణ పరీక్షలు చేయించుకోలేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.

> **అనుమానాలు ఉన్నాయి**
>
> సదరం స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు ఇక్కడ పరీక్షలు చేస్తున్నాం. కానీ, ఈఎన్‌టీ, ఆర్థో లాంటి పరీక్షలకు కరీంనగర్‌కు పంపిస్తుంటాం. అక్కడినుంచి వస్తున్న నివేదికల్లో అనుమానాలు వస్తున్నాయి. అందుకోసమే వరంగల్ లేదా హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నాం. దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
>
> – రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఓటరు జాబితాలో చేర్చండి

- ఎలక్ట్రోరల్ పరిశీలకుడు సి.సుదర్శన్‌రెడ్డి


ఈవీఎంలు పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాల: అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చాలని ఎలక్ట్రోరల్ పరిశీలకుడు సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నాణ్యమైన జాబితా సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, జెండర్ రేషియా, ఈపీ రేషియా తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఈవీఎంల వినియోగ ప్రదర్శనను పరిశీలించారు. అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవోలు రాజేశ్వర్, నర్సింహమూర్తి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు, వివిధపార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చీకటి రోజులే..

- మంత్రి కొప్పుల ఈశ్వర్


మంత్రికి గొర్రెపిల్ల బహూకరిస్తున్న గొల్లకురుమలు

వెల్గటూర్(ధర్మపురి): కాంగ్రెస్ అధికారం లోకి వస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లి, కొత్తపేట, పడకల్‌లో శనివారం మంత్రి ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగానికి మూడు గంటల కరెంట్‌చాలని అంటున్నారని, మూడు గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో, మూడు పంటలకు నీరందించే ప్రభుత్వం కావాలో తేల్చుకోవాని ప్రజలను ఆయన కోరారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాళేశ్వరం నీళ్లు ఎక్కడ వస్తున్నాయని అనవసర విమర్శలు చేస్తున్నారన్నారు. నీళ్లులేక పంటలు ఎండిపోయిన దాఖలాలు ఎక్కడా లేవని చెప్పారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్యాలయం ముట్టడి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

ధర్మపురి: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శనివారం పట్టణంలోని మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు సమ్మె కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే మంత్రి కార్యాలయం ముట్టడించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని, గ్రాట్యుటీ, రిటైర్‌మెంటు ప్రయోజనాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేయాలని కోరారు. అనంతరం మంత్రి పీఏ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షల పెంపుతో మార్పు

- ఎస్పీ భాస్కర్


ప్రశంస పత్రాలు అందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: శిక్షల పెంపుతో సమాజంలో మార్పు వస్తుందని ఎస్పీ భాస్కర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో కేసుల ప్రగతిపై సమీక్షించారు. ప్రతీ కేసులో దోషులకు శిక్ష పడేలా కృషి చేస్తే పోలీసు శాఖపై ప్రజల్లో గౌరవం, నమ్మకం పెరుగుతుందన్నారు. కోర్టులో పెండింగ్ కేసులు, వారెంట్లు, సమన్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత కీలకమైందని, ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు పూర్తయ్యే వరకూ నేరాలను రుజువు చేసేందుకు అవసరమైన పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలను కోర్టులో సమర్పించాలని సూచించారు. కోర్టు సమాచారాన్ని ప్రాసిక్యూషన్‌కు, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు చేరవేయాలని చెప్పారు. కేసు ట్రయల్ సమయంలో పీపీల సలహాలు, సూచనలు స్వీకరించాలని అన్నారు. గత శనివారం జరిగిన మెగా లోక అదాలత్‌లో రాజీమార్గంలో కేసుల పరిష్కారినికి పోలీసు అధికారులు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి, అవగాహన కల్పించి 12,492 కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే పదో స్థానంలో నిలిచేలా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ భాస్కర్ ప్రశంస పత్రాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ వెంకటస్వామి, ఎస్బీ సీఐ నాగేశ్వర్‌రావు, సీఎంఎస్ ఎస్సై రాజునాయక్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా కేసీఆర్ సర్కార్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: సీఎం కేసీఆర్ ఉద్యోగులకు అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోతెరోడ్డులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రమేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు మామిడిపల్లి ఉమేశ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సదానందం, గౌరవ అధ్యక్షుడు ఎం.నజీర్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో గులాబీ జెండా

ప్రజల గుండెల్లో గులాబీ జెండా ఉందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. చల్‌గల్‌కు చెందిన 100 మంది యువకులు, మహిళలు, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన 20 మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా ఆయన ఆహ్వానించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. నాయకులు దావ సురేశ్, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గంగనర్సు, జాన్, సునీత, తిరుపతి, సౌజన్య ఉన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

రాయికల్(జగిత్యాల): పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

- డీఆర్డీఏ పీడీ నరేశ్


మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ నరేశ్

జగిత్యాలరూరల్: రుణాలతో మహిళా సంఘాలు చేపట్టిన ఆదాయాభివృద్ధి కార్యక్రమాల ఎంటర్ ప్రైజెస్ యూనిట్లను వేగంగా గ్రౌండింగ్ చేయాలని డీఆర్డీఏ పీడీ నరేశ్ సూచించారు. శనివారం స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో ఏపీఎంలతో గ్రౌండింగ్‌పై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో ఆదాయాభివృద్ధి కార్యక్రమాల కింద ఏర్పాటు చేసే యూనిట్లను టార్గెట్ ప్రకారం వందశాతం పూర్తి చేయాలన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలతో యూనిట్లు ఏర్పాటు చేసేలా మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాటిని లాగిన్‌లో నమోదు చేయించి గ్రౌండింగ్ తప్పనిసరిగా చేయించాలని అన్నారు. సెర్ప్ అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గ్రౌండింగ్‌ను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఉన్నతి కార్యక్రమం కింద అర్హులైన ఉపాధిహామీ కూలీలను గుర్తించి శిక్షణ తరగతులకు ప్రతీ మండలం నుంచి 15 మందిని పంపించాలని సూచించారు. అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి సుధీర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం బ్యాంక్ లింకేజీ రుణాలను పూర్తిచేయాలన్నారు. సెర్ప్‌కు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు వెంకటేశ్, మానిక్ రెడ్డి, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు

ధర్మపురి: అత్యవసర సమయంలో అవసరమైన రక్తం దానం చేస్తున్న వారే ప్రాణదాతలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో శనివారం ధర్మపురి స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 50మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, యువకుల రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం రక్తదానం చేసిన యువకులను, కార్యక్రమాన్ని నిర్వహించిన స్వర్ణకారులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది జమాధ్, దివ్య, ప్రకాశ్, నరేశ్ స్వర్ణకారుల సంఘం నాయకులు లక్ష్మీనరహరి, సింహరాజు ప్రసాద్, వెంకటేశం, రాజమౌళి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్యవైశ్య పారిశ్రామిక అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ప్రవీణ్



అల్లాడి ప్రవీణ్

కోరుట్ల: రాష్ట్ర ఆర్యవైశ్య సభ పారిశ్రామిక అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన వ్యాపారవేత్త అల్లాడి ప్రవీణ్‌ను నియమించారు. ఈమేరకు ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని..

జగిత్యాలక్రైం: స్థానిక కృష్ణానగర్‌లోని ఇంటి ఎదుట భార్య శుక్రవారం రాత్రి నుంచి ధర్నా చేస్తోంది. లావణ్యకు 2017లో వివాహం జరిగింది. కొద్దికాలంగా భర్తతో గొడవలు జరుగుతున్నాయి. ఈవిషయంపై పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. దీంతో లావణ్యను కాపురానికి తీసుకెళ్లేందుకు భర్త నిరాకరిస్తున్నాడు. భర్త తీరుకు నిరసనగా రెండు రోజులుగా లావణ్య భర్త ఇంటి ఎదుట బైఠాయించింది.

నియామకం



గంప ఆనందం

రాయికల్(జగిత్యాల): తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ రాజకీయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా గంప ఆనందం నియమితులయ్యారు. మైతాపూర్ గ్రామానికి చెందిన గంప ఆనందం నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. ఈమేరకు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ శనివారం నియామకపత్రం అందజేశారు.

కానిస్టేబుల్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న అదిషనల్ ఎస్పీ

జగిత్యాలక్రైం: కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, శుక్రవారం మృతిచెందారు. ఆయన స్వస్థల కోరుట్లకు ఆంజనేయులు భౌతికకాయానికి తీసుకెళ్లారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు శనివారం అక్కడకు వెళ్లి ఆంజనేయుల మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

క్రమబద్ధీకరించండి



సంఘీభావం తెలుపుతున్న భోగ శ్రావణి

రాయికల్(జగిత్యాల): ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను పర్మినెంట్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆమె సంఘీభావం ప్రకటించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పింఛన్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు అన్నవేని వేణు, తొగిటి లక్ష్మీనారాయణ, మంగళారపు లక్ష్మీనారాయణ, ఆకుల మహేశ్, గంగాధర్‌నాయక్, సామల్ల సతీశ్, పల్లికొండ నరేశ్, భూమేశ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం నుంచి రూ.3.49లక్షలు మాయం

జగిత్యాలక్రైం: స్థానిక కరీంనగర్ రోడ్డులోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం నుంచి శనివారం రూ.3.49 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన సామ వెంకటేశ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. మరో చోట ఇచ్చే రూ.3.49 లక్షలు తన దిచక్ర వాహనంలో పెట్టుకుని వచ్చాడు. బ్యాంక్ ఎదుట వాహనం పార్క్ చేశాడు. బ్యాంక్‌లోకి వెళ్లి కొన్ని డబ్బులు డిపాజిట్ చేశాడు. మళ్లీ వెనక్కి వచ్చేసరికి ద్విచక్ర వాహనంలోని రూ.3.49 లక్షలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.





తిరగబడ్డ పోరుగడ్డ..!

- నేలకొరిగిన వందలాది మంది యోధులు
- పోరు చరిత్రలో ఉమ్మడి జిల్లాది ప్రముఖపాత్ర
- సాయుధ పోరాటానికి తలవంచిన నిరంకుశత్వం
- నేడు తెలంగాణ విమోచన (విముక్తి) దినోత్సవం

కరీంనగర్: 'బాంచెన్.. కాల్మొక్తాదొరా.. అన్నవారే భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఉమ్మడి జిల్లా తిరగబడింది. రజాకార్లను తరిమికొట్టింది. ఇక్కడి ప్రజలు ఎక్కడికక్కడ పలుగు, పార, చేతికి ఏది దొరికితే దాంతోనే పోరుబాట పట్టారు. సాయుధ గెరిల్లాలుగా, నాయకులుగా అగ్రభాగాన నిలిచారు.

తిరుగుబావుటా 'గాలిపెల్లి'

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత చరిత్ర ఉంది. నిజాం రాజ్యహింసకు ఒకేరోజు పదకొండు మంది ప్రాణాలర్పించిన ఆ నేల రక్త సింధూరమైంది. నిజాంకు వ్యతిరేకంగా పోరుచేస్తున్న బద్దం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నిజాం ఆధీనంలోని ప్రైవేటు సైన్యం రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెలు తిరగబడ్డాయి. జనం కొడవళ్లు, గొడ్డళ్లు, బరిసెలు, గుల్లేర్లతో పోరుసాగించారు. నిజాం పోలీసులు, రజాకార్లపై తిరుగబడిన గాలిపెల్లిలో భీకరపోరు సాగింది. ఆ పోరులో గాలిపల్లితో పాటు సమీప గ్రామాలకు చెందిన పదకొండు మంది ఒకే రోజు అమరులయ్యారు. పీసు బక్కయ్య, బద్దం నారాయణ, బుర్రయ్య, పుల్లుగారి ఎల్లయ్య, అల్లెం వెంకయ్య, తాళ్లపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి, నర్సక్కపేటకు చెందిన ఎలేటి రాజిరెడ్డి, సోమారంపేటకు చెందిన ఐరెడ్డి భూంరెడ్డి, బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన తుమ్మోజి నారాయణ అమరులయ్యారు. రజాకార్ల దాడిలో బద్దం ఎల్లారెడ్డి, రాజలింగం, అమృత్‌లాల్‌శుక్లా తప్పించుకోవడంతో ఆగ్రహంతో రజాకారులు గాలిపెల్లిని తగులబెట్టారు.

సాయుధవీరులు అసువులు బాసిన నేల

తెలంగాణ విముక్తి కోసం.. నిజాంప్రభుత్వ అరాచక పాలనను ఎదిరించిన సాయుధ పోరాటవీరులు.. హుస్నాబాద్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉంది. పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు రజాకార్లతో పోరుచేస్తూ మహ్మదాపూర్‌కు చేరుకున్నాయి. 14 మార్చి 1948లో మహ్మదాపూర్‌లో సమావేశం అయ్యారు. ఆ సమయంలో పోలీస్ పటేల్ వారిని భోజనానికి పిలిచి ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి తెలిపారు. రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టి కాల్పులు జరపడంతో 12 మంది అమరులయ్యారు. వీరుల జ్ఞాపకార్థం అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి పేరుతో రెండు సమాధులు నిర్మించారు. ప్రతియేటా వారి వర్ధంతి రోజు సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటారు.

రణభేరి మోగించిన 'అనభేరి'

అనభేరి ప్రభాకర్‌రావు.. 1910 ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పొలంపెల్లి గ్రామంలో జమీందారి కుటుంబంలో జన్మించారు. సాయుధ పోరాటంలో తొలి దళ నాయకుడిగా తుపాకీ పట్టి పేదలకు బాసటగా నిలిచారు. రజకార్ల ఆకృత్యాలు, ఆరాచకాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలనే లక్ష్యంతో జాగీర్‌దార్ వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేశారు. రజాకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. చివరకు 1948 మార్చి 14న హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో నిజాం ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో అమరుడయ్యారు.



హుస్నాబాద్‌లో నెలకొల్పిన అనభేరి కాంస్య విగ్రహం(ఫైల్)



సాయుధ దళాలు (ఫైల్)

కొదురుపాక యోధులు



కేశవరావు (ఫైల్)



ఆనందరావు (ఫైల్)

బోయినపల్లి: రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన జోగినిపల్లి కేశవరావు, మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు ఆధ్వర్యంలో నైజాం, రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమానికి తెరలేపారు. 1920లో జన్మించిన జోగినిపల్లి కేశవరావు.. వ్యవసాయంతోపాటు సోషల్ వర్క్ చేసేవారు. 1940లో సాయుధ దళాలకు ఆయుధాలు సమకూర్చేవారు. మహారాష్ట్ర చాందా, నాగ్‌పూర్ నుంచి ఆయుధాలు సేకరించి ఇక్కడి దళాలకు అందించేవారని చెబుతుంటారు. ఈ క్రమంలో మూడుసార్లు వరంగల్ జిల్లాలో జైలు జీవితం గడిపారు. కేశవరావుకు భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారుడు జోగినిపల్లి శ్రీనివాసరావు, కూతుళ్లు శోభమ్మ, శశికళ, స్వర్ణలత సంతానం. పెద్ద కుమార్తె శోభమ్మ ఇప్పటి సీఎం కేసీఆర్ భార్య.

ఆనందరావు పేరిట స్మారకస్తూపం

మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు పేరు సాయుధపోరు చరిత్రలో నిలిచింది. 1921లో జన్మించిన ఆనందరావు బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. ఈయన తెలంగాణ పల్లెల్లో నిజాం ప్రభుత్వ ఆరాచకాలను జీర్ణించుకోలేదు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరులో చురుకుగా పాల్గొన్నాడు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావుకు మేనమామ అయిన ఆనందరావు సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన సాయుధ పోరులో కీలక పాత్ర పోషించారు. ఆరు నెలలు జైలు జీవితం గడిపారు. హైదరాబాద్ సంస్థానం విలీనం అయ్యాక ఆనందరావు సేవలకు ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించి సత్కరించింది.


పోరులో 'చెన్నమనేని'



రాజేశ్వర్‌రావు (ఫైల్)

విద్యార్థి దశ నుంచే చెన్నమనేని ఉద్యమ సేనానిగా మారారు. అప్పటి విద్యార్థి సంఘం సిటీ కాలేజీ కార్యదర్శి రఫీ అహ్మద్‌తో 1947 ఆగస్టు 15న కళాశాలపై జెండా ఎగురవేయించారు. పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే మారువేశంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన యోధుడు. నిజాం పోలీసులు 3 అక్టోబర్ 1947 నుంచి ప్రివెంటివ్ డిటెన్షన్ వారంట్ జారీచేయగా.. అజ్ఞాతంలో ఉంటూనే విలీనోద్యమంలో పాల్గొన్నారు. చంచల్‌గూడ, గుల్బర్గా జైలులో ఏడాది మగ్గారు.

కొరియర్‌గా 'దేశిని'



చినమల్లయ్య(ఫైల్)

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన దేశిని చిన మల్లయ్య అనభేరి ప్రభాకరరావు దళానికి కొరియర్‌గా పనిచేశారు. పరిసర గ్రామాల్లో తిరగడం.. వివరాలు సేకరించి, దళానికి చేరవేయడం ఈయన బాధ్యత. విలీనం తరువాత సీపీఐలో కొనసాగుతూ నాలుగు సార్లు సర్పంచ్, ఒకసారి సమితి ప్రెసిడెంట్, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు.

విద్యార్థిగానే జువ్వాడి గౌతంరావు పోరు



గౌతంరావు (ఫైల్)

విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. విలీనోద్యమంలో పాల్గొని కరీంనగర్, వరంగల్ జైళ్లలో శిక్ష అనుభవించారు. 1947లో ఔరంగాబాద్ జైలు నుండి తప్పించుకొని వచ్చి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. బద్దం ఎల్లారెడ్డి వంటి వీరుల మార్గదర్శకత్వంలో పనిచేశారు.

అజ్ఞాతంలో ఉంటూనే బోవెరా ఉద్యమం



వెంకటరామారావు(ఫైల్)

1947 అక్టోబర్ 2న అనేక గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు జరిపిన యోధుడు. సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని ఊరూరా ప్రచారం చేశారు. బెజ్జంకి గోదాం లూటీ చేయించడంలో కీలకపాత్ర పోషించారు. నిజాం పోలీసులు, రజాకార్లు తోటపల్లిలోని ఆయన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు.

స్ఫూర్తి ప్రదాత.. బద్దం ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి (ఫైల్)

గాలిపెల్లికి చెందిన బద్దం హన్మంతరెడ్డి, లచ్చవ్వ దంపతులకు 1906లో జన్మించారు బద్దం ఎల్లారెడ్డి. యుక్త వయసులోనే కమ్యూనిజం భావజాలాన్ని ఒంట బట్టించుకున్నారు. గెరిల్లా దళాలకు మానాల క్యాంపులో శిక్షణ ఇచ్చారు. 1948 మార్చి 12న ఇల్లంతకుంట పోలీసు క్యాంపుపై దాడి చేసి ఎస్సైతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. పేదల అప్పు పత్రాలను పెత్తందార్ల నుంచి తెచ్చి ప్రజల సమక్షంలో కాల్చివేశారు. 1951లో జరిగిన తొలి ఎన్నికల్లోనే పీడీఎఫ్ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి బద్దం ఎల్లారెడ్డి విజయం సాధించారు. అప్పుడు ఆయన ప్రత్యర్థి పీవీ.నర్సింహరావు.

సామాన్యులే.. సాయుధులై

సిరిసిల్లకల్చరల్: సాయుధ పోరులో నిజాం వ్యతిరేక ఉద్యమకారులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. సింగిరెడ్డి భూపతిరెడ్డి లక్ష్మీపూర్ తాళ్లపల్లి ఆర్య సమాజ్, వందేమాతరం, స్టేట్ కాంగ్రెస్‌లో పనిచేశారు. రాత్రిపూట పాఠశాలల్లో విద్యను వ్యాప్తి చేశారు. రైతులకు జరిగే అన్యాయాలను ఎదిరించారు. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటాలకు దిగారు. మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి వీరమరణం పొందారు.

ఆంధ్ర మహాసభతో స్ఫూర్తి

1935 సెప్టెంబర్ 6న సిరిసిల్లలో నాలుగో ఆంధ్ర మహాసభను నిర్వహించారు. ఉపాధ్యాయుడు అమృతలాల్‌శుక్లా, మాడపాటి హన్మంతరావు అధ్యక్షత వహించిన ఈ సభలో బూర్గుల రామకృష్ణారావు, కేవీ.రంగారెడ్డి, జేవీ నర్సింగరావు, సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డి వంటి రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొని స్ఫూర్తి రగిలించారు. వందలాది యువకులు, విద్యార్థులు ఉద్యమంలో పాల్గొన్నారు. కోడి రామకృష్ణ బల ప్రదర్శన ఈ సభకు ప్రత్యేక ఆకర్షణ అయింది. ఆంధ్ర మహాసభ కార్యకర్తలకు అన్నం పెడుతున్నారని బండపెల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి ఇల్లును పోలీసులు లూటీ చేశారు. రుద్రంగి నర్సింగరావు, వై.హన్మంతరావు, అమృతలాల్‌శుక్లా తదితరులు సిరిసిల్ల, రుద్రంగి, లింగంపేట, సనుగుల, మల్యాల, ఎనుగంటి, బావుసాయిపేట, మామిడిపల్లి, కనగర్తి, హనుమాజీపేట, మల్లారం, మూడపల్లి, బాలరాజుపల్లి, నూకలమర్రి, మర్రిపెల్లి, నెమలికొండ గ్రామాల్లో జాతీయ జెండాలెత్తి ఉద్యమానికి ప్రజల్లో ఉత్తేజం కలిగించారు. చెన్నమనేని రాజేశ్వరరావు 1939లో ఏడో తరగతిలో ఉండగానే వందేమాతరం ఉద్యమంతో ప్రభావితుడయ్యారు. వీరికి స్వయానా బావ అయిన పొల్కంపల్లి వెంకటరామారావు ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లాకు అధ్యక్షులు. రాజేశ్వరరావు 1942లోనే స్కాలర్స్ డిబేటింగ్ సొసైటీ పేరుతో విద్యార్థి సంఘాన్ని ప్రారంభించారు. కోనరావుపేటకు చెందిన సీహెచ్.రాజలింగం రజాకర్ల క్యాంపుపై త్రివర్ణ పతాకం ఎత్తి పారిపోయాడు. మడుపు రాజిరెడ్డి, మర్రిగడ్డ సాయన్న తదితరులు నిర్బంధ లెవీ ధాన్యం వసూలుకు వ్యతిరేకంగా విలీనోద్యమంలో పాల్గొన్నారు.

కోరుట్ల కోట బురుజుల సాక్షిగా..



గొనె శంకర్

కోరుట్ల: కోరుట్ల కోట బురుజుల కిందిభాగంలో ఉన్న వాగు ఆనుకుని ఉన్న అవతలి ప్రదేశంలో రజాకార్ సైన్యం తిష్ట వేసిందన్న విషయం తెలుసుకున్న కస్తూరి ఎల్లప్ప ఆయన సహచరులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. రాత్రి వేళ వాగుకు ఇవతల వైపు ఉన్న చెట్లకు దివిటీలు కట్టడంతోపాటు కొంత మంది దివిటీలు పట్టుకుని అటు..ఇటు తిరుగుతూ డప్పుల చప్పుళ్లు చేస్తూ ఇండియన్ మిలటరీ కోరుట్ల కోట బురుజుల సమీపంలో ఉన్నట్లు.. గ్రామస్తులు వారికి స్వాగతం పలుకుతున్న వాతావరణాన్ని సృష్టించారు. ఈ క్రమంలో వాగుకు అవతల వైపు ఉన్న రజాకార్ మూకలు ఇండియన్ మిలటరీలో ఓ భాగం కోరుట్లకు వచ్చి ఉంటుందన్న భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది.

అప్పుడు నాకు పదహారేళ్లు: శంకర్, కోరుట్ల

కస్తూరి ఎల్లప్ప కోరుట్లలో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభించిన సమయంలో నాకు పదహారేళ్లు. నేను ఆర్ఎస్ఎస్ శిక్షణకు వెళ్లేవాడిని. రజాకార్లు వచ్చారని ఎల్లప్పతో పాటు కొంత మంది వాగు వెంబడి ఇండియన్ మిలటరీ ఉందన్న రీతిలో అలజడి చేశారు. దీంతో రజాకార్లు వెళ్లిపోవడంతో కోరుట్లకు భయం తప్పింది.

పోరుబాటలో గట్టెపల్లి బిడ్డ



మురళి (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన మురళీధర్‌రావు సాయుధ దళ సభ్యుడిగా ఉండి నిజాం రజాకార్లను ఎదుర్కొన్నారు. అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి రజాకార్లపై దాడులు చేశారు. 1943లో కమ్యూనిస్టులో చేరిన మురళి.. గొరెల్లి జమిందారి నర్సుబాయమ్మ దౌర్జన్యాలను ఎదిరించి విజయం సాధించారు. మహ్మదాపూర్ గుట్టలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మురళి గుట్టపై నుంచి దూకి తప్పించుకున్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయడంతో మురళీపై పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. అలుపెరగని పోరాటం చేసిన మురళీధర్‌రావు 1988 జూన్ 2న మృతిచెందారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- కోరుట్ల యువకుడి దుర్మరణం



రోహిత్‌రావు(ఫైల్)

కోరుట్ల: పట్టణంలోని భీమునిదుబ్బకు చెందిన బీటెక్ విద్యార్థి జోగన్‌పల్లి రోహిత్‌రావు(21) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని కొంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పట్టణంలో విషాదం నెలకొంది. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న రోహిత్‌రావు.. మూడు రోజులు సెలవులు ఉన్న క్రమంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి కోరుట్లకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు. కొంపల్లి వద్ద బంధువుల కారు ఉండటంతో అక్కడి వరకు డ్రాప్ చేయమని తన క్లాస్‌మేట్‌ను రోహిత్ కోరాడు. ఈ క్రమంలో ఇద్దరూ మోటార్‌సైకిల్‌పై కొంపల్లికి వెళుతున్న క్రమంలో కొద్దిదూరం వెళ్లగానే బస్సు-మోటార్‌సైకిల్‌కు ఢీకొని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న రోహిత్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడు తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కోరుట్ల పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జోగన్‌పల్లి కృష్ణమోహన్‌రావు-సుజాత దంపతుల ఏకైక కుమారుడు రోహిత్‌రావు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. చదువు పూర్తిచేసుకుని చేతికి అందివస్తాడనుకున్న తరుణంలో ప్రమాదం జరిగి రోహిత్‌రావు మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

మాజీ సైనికుడి ఆత్మహత్య

- మానసిక స్థితి సరిగా లేక అఘాయిత్యం



నేమిల్ల సురేందర్(ఫైల్)

కోరుట్లరూరల్: పైడిమడుగు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు నేమిల్ల సురేందర్ శుక్రవారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. సురేందర్ 1999లో మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ శిక్షణ పొందాడు. 2002 కార్గిల్ యుద్ధ సమయంలో జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తించారు. 2003–2021 వరకు పంజాబ్, రాజస్థాన్, హైదరాబాద్, కలకత్తా రెజిమెంట్లలో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేశారు. కొద్దిరోజులుగా పైడిమడుగులోనే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. భార్య ఉమ, పదో తరగతి చదువుతున్న కుమారుడు విక్రాంత్‌రెడ్డి, ఐదో తరగతి చదువుతున్న కూతురు నిషిత ఉన్నారు. విక్రాంత్‌రెడ్డికి కంటి చూపు సరిగా లేదన్న విషయంలో సురేందర్ తరచూ మనస్తాపానికి గురయ్యేవాడని సమాచారం. దీంతో కొంత కాలంగా మానసిక స్థితికి సంబంధించిన మాత్రలు వాడుతున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

రైలు పట్టాలపై ప్రైవేట్ ఉపాధ్యాయుడి మృతదేహం



వరప్రసాద్‌శర్మ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం రైల్వే పట్టాలపై పడి ఉండగా శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన కామారపు వెంకటలక్ష్మి సుబ్రహ్మణ్య సీతారామాంజనేయ వరప్రసాద్‌శర్మ(54) ప్రైవేట్ ఉపాధ్యాయుడు. శనివారం ఉదయం కరీంనగర్ రైల్వేస్టేషన్ శివారులోని రైల్వే పట్టాలపై తల తెగిపోయి మొండెం కన్పించింది. రైల్వేపోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆధారాలు లభించలేదు. శుక్రవారం రాత్రి కరీంనగర్ నుంచి కాచిగూడ వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోషల్ మీడియాలో మృతి సమాచారం రావడంతోకుటుంబసభ్యులు గుర్తించి రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతికి సమాచారం అందించారు. ఆదివారం పోస్ట్‌మార్టం అనంతరం ప్రమాదమా, ఆత్మహత్య అనే విషయాన్ని నిర్ధారిస్తామని హెడ్‌కానిస్టేబల్ తెలిపారు.

ఫేస్‌బుక్‌లో రుణ సమాచారం

- రూ. 2.57 లక్షలు మోసం

కథలాపూర్(వేములవాడ): ఫేస్‌బుక్‌లో తక్కువ వడ్డీకే రుణం ఇస్తామని ప్రకటన చూసి.. దాని ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తి రూ.2.57 లక్షలు మోసపోయిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. అంబారిపేట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఫేస్‌బుక్‌లో ఈనెల మొదటి వారంలో తక్కువ వడ్డీకే రుణం అనే సమాచారంతో ప్రకటన వచ్చింది. ఇది నమ్మిన సదరు వ్యక్తి.. ప్రకటన ఆధారంగా ఆన్‌లైన్‌లో పూర్తివివరాలు నమోదు చేశాడు. ఈనెల 8, 9, 10 తేదీల్లో ఆన్‌లైన్‌లో డబ్బులు రూ.2.57 లక్షలు చెల్లించాడు. తర్వాత తిరిగి సమాధానం రాకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి శనివారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు అల్ఫోర్స్ విద్యార్థిని



శ్రీహాసిని అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎం.శ్రీహాసిని రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం విద్యార్థిని పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో ఎన్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో శ్రీహాసిని విశేష పరిజ్ఞానాన్ని ప్రదర్శించి ప్రథమ బహుమతి గెలుపొందడంతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు విద్యతో పాటు వివిధ అంశాల పట్ల ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.